www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య



రేపు బిసి మహాసభ

ప్రజాశక్తి-రాయచోటి



మాట్లాడుతున్న పద్మ

పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని అజయ్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగే జిల్లా బిసి మహాసభను విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులు డివిటి పద్మ పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు రోడ్డు లక్ష్మీపురంలో తన నివాసంలో పద్మ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు జిల్లా జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆద్వర్యంలో మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బసిలందరూ అన్ని నియోజకవర్గాల, మండలాల, అన్ని గ్రామాల, అన్ని సంఘాల అధ్యక్ష, ప్రదాన కార్య దర్శులు, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో బాలగని, చిన్న రెడ్డెయ్య యాదవ్, జె.నాగేశ్వర, మల్లికార్జున, వెంకటరమణ, జియరాం, రవి,రమణ, నాగేంద్రబాబు, పాల్గొన్నారు.

ప్రేమికుల రోజే దారుణం

యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి

- తీవ్రంగా గాయపడిన బాధితురాలు
- ఆసుపత్రిలో చేర్చిన బంధువులు
- పరామర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు
- మెరుగైన వైద్యం అందిస్తాం : మంత్రి
- నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం :ఎస్‌పి
- సంఘటనపై ఫోన్లో ఆరా తీసిన మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత
- యువతి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన మేజిస్ట్రేట్



యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమి, నిందితుడు గణేష్ (ఫైల్‌ఫొటో)



మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇస్తున్న యువతి, మీడియాతో మాట్లాడుతున్న మంత్రి

ప్రేమికుల దినోత్సవం రోజునే దారుణం చోటు చేసుకుంది. సైకోలా మారిన యువకుడు తాను ప్రేమించిన యువతిపై అఘాయిత్యానికి ఒడికట్టాడు. తాను ప్రేమించిన అమ్మాయి మరెవ్వరికీ దక్కకూడదని కర్కశత్వానికి పాల్పడ్డాడు. తనను కాదని తల్లిదండ్రులు చూసిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడిందని అంతమొందించేందుకు వెనుకాడలేదు. పథకం ప్రకారం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. కత్తితో దాడి చేసి, ఆపై యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడి పరారయ్యాడు. గమనించిన బంధువులు యువతిని హుటాహుటినా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మదనపల్లె డిఎస్‌పి, సిఐలను అప్రమత్తం చేసి ఆసుపత్రికి పంపడంతో వారు సకాలంలో ఆస్పత్రికి చేరుకుని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎస్‌పి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాష, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువతి పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. వివరాలు..

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్ / గుర్రంకొండ

గుర్రంకొండ మండలం, నడిం కండ్రిక పంచాయతీ, ప్యారంపల్లెకు చెందిన జనార్ధన్, రెడ్డమ్మ దంపతులకు కుమార్తె గౌతమి, కుమారుడు రాజేష్ ఉన్నారు. గౌతమి డిగ్రీ వరకు చదువుకొని మదనపల్లె కదిరి రోడ్డులోని సంఘం ఫంక్షన్ హాల్ వద్ద ఓ బ్యూటీఫార్లర్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో మదనపల్లె అమ్మ చెరువు మిట్టకు చెందిన చేనేత కార్మికుడు మురళి కుమారుడు గణేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో ఆమె వెంట వేధించేవాడు. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు కుమార్తెను పనులు మాన్పించి ఇంటికే పరిమితం చేశారు. బంధువుల పిల్లవాడికి ఇచ్చి వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ నేపథ్యంలో ఈనెల 7న గౌతమికి నిశ్చితార్థం అయింది. ఏప్రిల్ 29న వివాహనం కానుంది. భరించలేని ప్రేమోన్మాది సైకోలా మారిపోయాడు. తాను ప్రేమించిన అమ్మాయి తనను కాదని మరో వ్యక్తిని వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. స్నేహితునితో కలిసి శుక్రవారం తెల్లవారుజాము చీకట్లోనే యువతి స్వగ్రామం ప్యారంపల్లికి వెళ్లాడు. ఉదయం 6 గంటలకే తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగానే గౌతమి ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి చొరబడ్డాడు. ఈ సమయంలో తననే పెళ్లి చేసుకోవాలని యువతితో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. పథకం ప్రకారమే వెంట తెచ్చుకున్న కత్తితో యువతిపై దాడి చేయడంతో మెడ, గొంతు, చేతులపై రక్త గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న యాసిడ్ ను బలవంతంగా తాపబోయాడు. ఆమె నిరాకరించడంతో ముఖం మీద పోశాడు. దీంతో ఆమె కుప్పకూలి కింద పడింది. ఇంటి వాకిలి దగ్గరికి వేసుకొని పరారయ్యాడు. స్థానికంగా ఉన్న దేవాలయంలో భక్తి పాటలు పెట్టడంతో ఈ ఇంట్లో ఏమి జరుగుతుందో స్థానికులకు తెలియలేదు. ఇదిలా ఉండగా గౌతమి బంధువైన జయమ్మ పాలకోసం గౌతమి ఇంటికి వెళ్లగా బాధితురాలి కుప్పకూలి పడి ఉండటాన్ని చూసి కేకలు వేసింది. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఏకమై బాధితురాలిని 108లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అక్కడికి డిఎస్‌పి కొండయ్యానాయుడు, సిఐలు సత్యనారాయణ, ఎరిషావల్లి, రామచంద్ర వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నం చేశారు. అనంతరం మేజిస్ట్రేట్ వచ్చి యువతి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఇదే సమయంలో మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్ ద్వారా జరిగిన సంఘటన వివరాలను బాధితురాలి తండ్రితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. విషయం పట్టణంలో దావణంలా వ్యాపించడంతో యువతిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆస్పత్రి ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంకొండ పోలీసులు తెలిపారు.

బాధితురాలిని పరామర్శించిన మంత్రి, ఎస్‌పి, ఎమ్మెల్యే

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన యువతిని పరామర్శించేందుకు మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాష, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి వెంకటాద్రి, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి ఆసుపత్రికి చేరుకొని యువతిని పరామర్శించారు. ఆమె తల్లిదండ్రులను దాడిపై ఆరా తీశారు. వైద్యులతో భేటీ అయి యువతి అరోగ్య పరిస్థితిని కనుక్కున్నారు. అనంతరం నారా లోకేష్‌కు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. అనంతరం తీవ్రంగా గాయపడిన గౌతమిని బెంగుళూరుకు తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుంది : మంత్రి

యువతిపై యాసిడ్ దాడి చాలా బాధాకారమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యానించారు. యువతి పూర్తిగా కోలుకునేవరకు వైద్య ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యువతులు ఇలాంటి థ్రెట్ ఉన్నట్లు ముందే పసిగడితే పోలీసులను ఆశ్రయిస్తే ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలింపు : ఎస్‌పి

ఈ దుశ్చర్యకు పాల్పడింది మదనపల్లె ప్రాంతానికి చెందిన గణేష్‌గా గుర్తించామని, నిందితున్ని పట్టుకోవడం కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. త్వరలోనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు. నిందితుడి ఆచూకి తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అరెస్టు చేసిన తరువాత తామే మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు.



యువతిపై యాసిడ్ దాడిని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రేమ పేరుతో దాడులు ఆటవిక చర్య : సిపిఎం

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని నిరసన

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ప్రేమ పేరుతో దాడులు చేయడం ఆటవికమని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. యువతిపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన నిర్వహించారు. మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ గుర్రంకొండ మండలం, ప్యారంపల్లికి చెందిన యువతిపై ప్రేమోన్మాది దాడిని ఖండిస్తూ, సైకో గణేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిగ్రీ చదువుకుని స్వయం ఉపాధి పొందుతున్న యువతి ప్రేమించలేదనే ఉన్మాదంతో కత్తితో పొడిచి, యాసిడ్ పోసి దాడి చేయడ్నా ప్రతి ఒక్కరూ తలదించుకునే దుర్ఘటన అన్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు. బాధిత యువతి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని, ఆమెకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిందితుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్త, పార్టీ సానుభూతి పరుడిగా తెలుస్తోందని, ఆ కోణంలో నిందితున్ని రక్షించే ప్రయత్నం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, సిఐటియు నాయకులు రెడ్డిప్రసాద్, వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు శివప్రసాద్, వెంకటశివ, మహిళా సంఘం నాయకురాలు రెడ్డిప్రసన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాంబశివ నాయక్, యువజన నాయకులు పవన్ పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

-డిఆర్ఒ మధుసూదనరావు



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిఆర్ఒ, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

దామోదరం సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సేవా దృక్పథాన్ని పెంచుకోవాలని, దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు దామోదరం సంజీవయ్య అని డిఆర్ఒ మధుసూదనరావు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దళిత కుటుంబంలో పేదరికంలో పుట్టాడని, అట్టడుగు స్థాయి నుంచి దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా, కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పదవులను అధిరోహించి తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేశారని అన్నారు. తాను కర్నూలు జిల్లాలో విధులు నిర్వహించేటప్పుడు దామోదరం సంజీవయ్య అన్న కొడుకుతో మాట్లాడేవాడినని, ఆయన గురించి ఎన్నో విషయాలు తెలుసుకుని ఆయన నుంచి స్ఫూర్తి పొందానని పేర్కొన్నారు. మద్రాసులో లా చదువుకొని తర్వాత రాజకీయాలలోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి స్థాయికి, కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. హైదరాబాదులో ఉన్న సంజీవయ్య పార్కుకు ఆయన జ్ఞాపకార్థం సంజీవయ్య పార్క్ అని నామకరణం చేశారన్నారు. జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్లో జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. సమావేశంలో డివిఎంసి కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటరమణ, రాజశేఖర్, బోదేశావలి, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులు, పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** సంపద, సంతతి లేకుండా జీవించిన అతి కొద్దిమంది రాజకీయవేత్తల్లో దామోదరం సంజీవయ్య ఒకరని, సంజీవయ్య ప్రస్థానం నేటి పాలకులకు స్ఫూర్తి దాయకమని ఆయన 104వ జయంతిలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో నేడు అంత ర్భాగంగా ఉన్న కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఒక సామాన్య దళిత కుటుంబం లో దామోదరం సంజీవయ్య జన్మించి ఉన్నతమైన స్థానానికి ఎదిగారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వే షన్లను అమలు చేయడం, రిజర్వేషన్ల శాతాన్ని ఎస్‌సి, ఎస్‌టిలకు 14 నుంచి 17 శాతానికి, బిసిలకు 24 నుంచి 38 శాతానికి పెంచిందీ ఆయనేనని చెప్పారు. వృద్ధాప్య పింఛన్లు ఇచ్చింది, కార్మికులకు బోనస్ ఇచ్చే పద్ధతికి శ్రీకారం చుట్టి ఒదన్నారు. కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, ప్రెసిడెంట్ బురుజు రెడ్డిప్రసాద్ లతోపాటు బాస్, వీసీకే నాయకులు రవిశంకర్, తలారి కృష్ణ, వై. గంగాధర్, రాయల్‌సూరి, బి.నర్సింహులు, బైనేని సురేష్, రవిప్రకాష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ లోక్ అదాలత్ అందిస్తున్న సేవలను కక్షీ దారులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు 11 అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులు రాజీమార్గంలో సులభంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదికన్నది ప్రజలకు తెలియజేయాలని కోరారు. చిత్తూరుజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత, ప్రాధాన్యతల గురించి వివరించారు. ప్రజలు తమ వివాదాలను పరస్పర అంగీకార పద్ధతిలో తక్కువ సమయం, ఖర్చుతో త్వరగా పరిష్కరించుకునే అవకాశాన్ని న్యాయ సేవాధికార సంస్థ అందిస్తోందని చెప్పారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేలా కృషి చేయాలని సూచించారు. పోలీసు అధికారులు కోర్టు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను త్వరగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం, చర్చా సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు.. ఈ సమీక్షా సమావేశానికి పీలేరు స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, ఎపిపి శారద, పీలేరు సిఐ యుగంధర్, ఎస్ఐ-2 లోకేష్, పంచాయతీ ఇఒ గురు మోహన్, పీలేరు జ్యుడీషియల్ పరిధిలోని పీలేరు, కెవి పల్లి, ఎర్రావారిపాలెం, రొంపిచర్ల, చిన్నగొట్టిగల్లు, సదుం మండలాల పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్

నందలూరు: నందలూరు కోర్టులో మార్చి నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమాన్ని అత్యధిక సంఖ్యలో కేసులు వచ్చే విధంగా చూడాలని, రాజీమార్గమే రాజమార్గమనే విషయాన్ని కేసులో ఉన్న ఇరు పార్టీల కక్షీ దారులకు అవగాహన కల్పించి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించాలని అన్నారు. ప్రధానంగా క్రిమినల్, సివిల్ చెక్ బౌన్స్, సి సి తదితర కేసులు అన్నింటిని లోక్ అదాలత్ ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ ఎఐ రమణ, పుల్లంపేట, నందలూరు, ఎస్ఐ జె. మోహన్ కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లు, పెనగలూరు ఎఎస్ఐ మల్లికార్జున, కోర్టు సూపరిండెంట్ రమేష్ కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి తోట

పంట పొలాలపై ఏనుగుల బీభత్సం

- రూ.లక్ష విలువ చేసే అరటితోట ధ్వంసం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆరుగాలం కష్టించి పండించే రైతుకు ఆ పంట చేతికి వచ్చినంత వరకు నమ్మకం లేదు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు దళారీల దోపిడీలు మరోవైపు వీటన్నిటిని దాటుకొని పంట ఆదాయం చేతికి వస్తే గాని రైతుకు కష్టాలు తీరవు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రంలో ఏనుగుల రూపంలో సుబ్రహ్మణ్యంరెడ్డి అనే రైతు అరటి తోటలో ఏనుగుల గుంపు చొరబడి అరటి పంటను ధ్వంసం చేసి లక్ష రూపాయల నష్టం మిగిల్చాయి. ఎంతో కష్టపడి అప్పులు తెచ్చి చెమటోడ్చి అరటి తోటను సాగు చేశానని, తీరా అరటిపంట చేతికొచ్చే సమయంలో ఏనుగులు అర్ధరాత్రి సమయంలో రక్షణ కోసం చేసిన కంచె, డ్రిప్‌పైపులను ధ్వంసం చేయడంతో సుమారు లక్ష రూపాయలు నష్టం సంభవించిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తమకు పంట నష్టపరిహారం అందించాలని ఏనుగుల నుండి తమ పంట రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అటవీ జంతువుల నుంచి తమను, తమ పంట పొలాలను దర్శించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఉత్పత్తిదారుల నుంచి సీల్డ్ టెండర్లు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పట్టు రైతులకు సరఫరా చేసేందుకు అవసరమైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఃకొనుగోలు చేయడానికి ఉత్పత్తిదారుల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ, 9966153900 నంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ నెల 17 నుంచి 24న మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చునని పేర్కొన్నారు.

దేవేంద్ర మృతి బాధాకరం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి మాసాపేటకు చెందిన వైసిపి యువజన నాయకుడు విక్కీ దేవేంద్ర మృతి పార్టీకి తీరనిలోటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించారు. దేవేంద్ర వైసిపి క్రియాశీలకంగా పనిచేశారని, వారి కుటుంబానికి తోడుగా ఉంటామని అన్నారు. అయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైసిపి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్‌బాషా, నాయకులు సుగవాసి శ్యామ్, జిఎండి ఇమ్రాన్, జిఎండి ఇర్షాద్, అమీర్, నవాజ్, కొత్తపల్లె ఇంతియాజ్ ఉన్నారు.



మాట్లాడుతున్న రామాంజులు


ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 6న కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తామన్న ప్రకటన వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 2 ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటిఎస్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పని చేస్తున్న ఉద్యోగులందరికి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ప్రతినెల ఒక శాతం కమిషన్‌తో వేతనాలు, సర్వీసు అందించే ఆప్కాస్‌ని రద్దుచేసి, నాలుగు శాతం కమిషన్ తీసుకునే రాబందులు లాంటి కాంట్రాక్టర్ల చేతికి 1 లక్షా 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తుని అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన పాలన ఇస్తామని భద్రత లేని ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం మొగ్గు చూపడం సరైనది కాదన్నారు. ఒకపక్క రాష్ట్ర ఖజానాలో నిధులు లేవంటూనే కాంట్రాక్టర్లకు రూ.70 కోట్లు చెల్లించేందుకు ఆప్కాస్‌ని రద్దు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాధవయ్య , రెడ్డెయ్య, రామచంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



సిసిరోడ్డుకు భూమి పూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వరదయ్య గారి పల్లె, మదన గోపాలపురం గ్రామపంచాయతీ లో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సారథ్యంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తూ భవిష్యత్తులో పట్టణాలతో గ్రామీణ ప్రాంతాలు పోటీపడేలా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున బాణాసంచాలతో, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చమర్తి సురేష్‌రాజు, పట్టణ అధ్యక్షులుదగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షులు శి నారాయణ చౌదరి, కౌన్సిలర్లు చంద్రమౌళి, రాజేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, సీనియర్ నాయకులు ములుగూరి సుబ్రమణ్యం నాయుడు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయదేవి పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి కుమారుడు ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి, లక్ష్మీ మౌనిక రెడ్డి వివాహం ఘరంగా నిర్వహించారు. శుక్రవారం రామాంజనేయపురంలోని మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ సెంటర్లో వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైసిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఎం.వి.శ్రీదేవి జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. జగన్‌తో సెల్ఫీ తీసుకునేందుకు చాలామంది పోటీపడ్డారు. వివాహ మహోత్సవానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, వివిధ కళాశాల యాజమాన్యాలు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.



నూతన వధూవరులతో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి

మార్చి చివరిలోగా గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

2020 నుంచి 2023 మధ్యకాలంలో పిఎంఎవై పథకంలో మంజూరైన గృహాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇఇ కె.రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పిఎంఎవై పథకం ద్వారా మంజూరైన గృహ లబ్ధిదారులకు రూ.1.80లక్షలు వంతున నిధులు కేటాయించిందని అన్నారు. ఇప్పటికీ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోని షెడ్యూలు కులాల లబ్ధిదారులకు గతంలో కేటాయించిన రూ.1.80 లక్షలకు తోడు అదనంగా మరో రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు వంతున అదనపు నిధులను కేటాయిస్తోందని చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇంటి నిర్మాణం పనులను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

లాక్రోస్ క్రీడలో ప్రతిభ చూపిన సిటిఎం విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడలో మదనపల్లె మండలం సిటిఎం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఈ నెల 7 నుంచి 9వ వరకు జరిగిన జాతీయ లాక్రోస్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా సిటియం జడ్‌పిహైస్కూల్లో 9 వ తరగతి చదువుతున్న తరుణ్, 8వ తరగతి చదువుతున్న విశ్వతేజ సత్తా చాటి మూడవ స్థానం కైవసం చేసుకున్నారు. అంతకుముందు జనవరిలో ఒంగోలులో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర సబ్ జూనియర్ జట్టుకు ఎంపిక అయి రాజస్థాన్ లోని ఉదయపూర్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు లాక్రోస్ క్రీడలో మెలకువలు నేర్పిన వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్‌బాబు, నాగరాజును, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీధర్

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ముక్కావారిపల్లి జడ్పి హైస్కూల్‌లో స్కూల్ చైల్డ్ స్క్రీనింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న కార్యక్రమమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఇది చక్కటి అవకాశమని అందరూ సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురువులు పాఠశాలలో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్స రానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో దరఖాస్తులను రాయలసీమ జిల్లాలలో 4వ తరగతి, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ఈ దరఖాస్తులు ఈనెల 7 నుంచి మార్చి 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 6న ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ కు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్నీ వివరాలు కోసం 8897983930, 9347783214 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



వీర జవాన్లకు ఘన నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

వీర జవాన్లకు ఘన నివాళి

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఎంవిఎస్ రాయలసీమ అధ్యక్షులు మాలతోటి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఫిబ్రవరి 14 మాత్రం చీకటి రోజని అన్నారు. ఆరేళ్ల క్రితం ఇదే రోజున భారత భద్రతా బలగాలపై ఉగ్రవాదులు దాడికి పాల్పడి 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల ప్రాణాలను బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఖదీర్‌బాషా, అధ్యాపకులు మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల దలవాయిపల్లిలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో వీర జవాన్ దివస్ సందర్భంగా వీర సైనికులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఫిబ్రవరి 14న జమ్మూ, శ్రీనగర్ హైవే మీద ఉగ్రవాదుల దాడిలో 40 మంది జవాన్లు వీర మరణం పొందారని అన్నారు. ఈ వీర జవాన్ల మరణానికి రెండు నిమిషాల మౌనం పాటించినట్లు తెలిపారు. విద్యార్థులు మానవహారంగా నిలబడి మన కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న జవాన్లకు తమ మద్దతును తెలిపారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి దళిత ముఖ్యమంత్రిగా నీలం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. **మదనపల్లె:** మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి ఆధ్వర్యంలో బ్లాక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పీజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పనా మాట్లాడుతూ మన దేశంలో భారతీయ సైనికులపై జరిగిన పుల్వామా దాడికి నిరసనగా ఈ బ్లాక్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులకు నిరసనగా భారత ప్రభుత్వం పుల్వామా దాడిలో చిరస్మరణీయులైన భారతీయ సైనికుల ఆత్మశాంతి కోసం ఈ బ్లాక్ డే ను నిర్వహిస్తూనట్లు గా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు మరియు ఎన్.సి.సి. క్యాడెట్స్ సైనికుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలపాటు మౌనం, క్రొవతుల ప్రదర్శన చేసినారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్ట్ నెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, శరవన ముత్తు, అధ్యాపకులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** 2019 ఫిబ్రవరి 14 భారత చరిత్రలో చీకటి రోజని తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి పేర్కొన్నారు. పుల్వామా ఘటనలో ఉగ్రవాదుల దాడిలో అమరులలైన సైనికులను స్మరించుకుంటూ విద్యార్థులతో కలసి మౌనం పాటించి, నివాళులర్పించారు. పుల్వామా ఉగ్రవాదుల దాడిలో 40మంది సైనికులు వీర మరణం పొందారన్నారు.

అనాలోచిత జిఒలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : వైద్య ఆరోగ్య ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరంకుశ జిఒలను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముడియాల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ముడియాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు పోస్ట్ కార్డు ఉద్యమం చేప ట్టారు. గత ప్రభుత్వం నిరంకుశ పరిపాలనలో వైద్య ఉద్యోగులకు 143/32 జిఒను ప్రవేశపెట్టి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రీడిప్లాయ్‌మెంట్ ద్వారా ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ముఖ ఆధారిత హాజరును పెట్టి వైద్య ఉద్యోగులను మానసిక వేదనకు గురి చేసిం దన్నారు. రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు వర్కిం గ్ ప్రెసిడెంట్ భానుమూర్తి చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు చదువుతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శ్రద్ధ చూపాలని బిట్స్ కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ పేర్కొన్నారు. మండలం పరిధిలోని బిట్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం వెబ్‌సైట్ డిజైనింగ్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన క్యాష్ని సిఇఒ అబుబక్కర్ సిద్ధిక్ జీరో కోడింగ్‌తో తక్కువ సమయంలో వెబ్ సైట్‌ను ఎలా తయారు చేయాలో తమ స్కిల్స్‌కను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు చదువుతోపాటు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించు కోవడానికి ఐటి రంగంలో రాణించడానికి దోహదపడుతుందని అన్నారు.



అబుబక్కర్ సిద్ధిక్‌ను సన్మానిస్తున్న బిట్స్ కళాశాల చైర్మన్, అధ్యాపకులు

కోళ్ల ఫారాలు తనిఖీ.. రైతులకు సూచనలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని కోళ్ల ఫారాలను మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తన బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉభయ గోదావరి జిల్లాలలో కోళ్ల ఫారంలోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని 29 కోళ్ల ఫారాలను గత నాలుగు రోజులుగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని 29 కోళ్ల ఫారాల్లో ప్రస్తుతం 3.45 లక్షల కోళ్లను రైతులు పెంచుతున్నట్లు తెలిపారు. బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్ల ఫారాలల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తూ, ఫారంలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని, క్లోరినేషన్ చేయాలని, ఫాగింగ్ చేసుకోవాలని, కోళ్లకు వైరస్ లు శోకకుండా ముందస్తుగా వాక్సినేషన్ చేసుకోవాలన్నారు. చనిపోయిన కోళ్లను ఎప్పటికప్పుడు షెడ్డు నుంచి తొలగించి జనావాసాలకు దూరంగా గుంత తీసి పూడ్చిపెట్టి, బ్లీచింగ్ చల్లాలన్నారు. ప్రజలు బర్డ్ ఫ్లూ వైరస్ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాగా ఉడికించిన కోడి మాంసాన్ని, గుడ్లను తీసుకోవచ్చు అన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రతాప్, మునేంద్ర, శాంతి తదితరులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని చిన్ననరుసుపల్లె గ్రామంలో రైతు దామోదరకు చెందిన కోళ్ల షెడ్లను శుక్రవారం పశుసంవర్ధకశాఖ రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ పశు వైద్యులు డాక్టర్ డి.గణేష్ పరిశీలించారు. కోళ్ల ఫారంలో యజమాని బైమో సెక్యూరిటీ నియమాలు పాటించాలని, కోళ్ల మృత్యువాత పడితే వెంటనే పశువైద్యులకు తెలియజేయాలని రైతుకు సూచించారు. అనంతరం పశువైద్యశాలలో సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో బర్డ్‌ఫ్లూ, 21వ పశుగణన, పశుసంవర్ధక శాఖ మీద సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం, పశుసంవర్ధక శాఖ సహాయకులతో సమీక్ష నిర్వహించారు.



నిమ్మనపల్లి : కోళ్ల ఫారాన్ని తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ సురేష్

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

ప్రజాశక్తి-పుల్లంపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాలకు సంబంధించిన బాధితులకు మూడు లక్షల రెండు వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీ సంజీవపురం గ్రామానికి చెందిన చింత ప్రభావతికి ఆస్పత్రిలో చికిత్స కొరకు ముందస్తుగా రూ.60వేలు, పుల్లంపేట మండలం టి.కమ్మపల్లి గ్రామానికి చెందిన నేలపాటి సాంబయ్య కూతురు దీక్షితకు రూ.80వేలు, ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి గ్రామానికి చెందిన కృష్ణవేణికి రూ.1.62లక్షలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఎప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆరోగ్యం బాలేనప్పుడు అప్పులు చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతారని అటువంటి వారికి సిఎం సహాయనిధి వరంలాంటిందని అన్నారు ఎవరైనా సరే ఆస్పత్రి బిల్లులు తీసుకుని వచ్చి తమను సంప్రదిస్తే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇవ్వడం పట్ల బాధితులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, రెడ్డయ్యరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జీవి పల్లవి, తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, పోలీసు, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణ నడిబొడ్డున ప్రభుత్వ స్థలంలో మరుగుదొడ్ల నిర్మాణాలను అధికారులు చేపట్టారు. గత మూడు రోజులుగా ఈ భూమి మాదేనంటూ అధికారులపై దౌర్జన్యం చేస్తున్న కబ్జాదారులపై బుధవారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరికలు జారీ చేసిన సంగతి విధితమే. పట్టణంలో వివిధ చోట్ల మున్సిపల్, రెవెన్యూకి సంబంధించిన ఆస్తులపై త్వరలో అధికార యంత్రాంగం కొరడా ఝులిపించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను,భూములను కాపాడుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.



మరుగుదొడ్లకు భూమి పూజ చేస్తున్న కమిషనర్ పల్లవి



రీసర్వే పనులను పరిశీలిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

భూ రీ సర్వే పనులను తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి-కలకడ

మండలంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ చొక్కన్న గారి పల్లి సమీపములో ఉన్న రైతులకు సంబంధించిన భూములను రీ సర్వేను జెసి పరిశీంచారని తహశీల్దార్ ఫణి కుమార్ తెలిపారు. జెసి మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలకు చోటు ఇవ్వకుండా నిష్పక్షపాతంగా నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించినట్లు తెలిపారు. వ్యవసాయ భూముల గ్రౌండ్ ట్రూటింగ్ పనులను, తహశీల్దార్‌ను పట్టాదారు లను అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు లకు ముందస్తు సమాచారం ఇచ్చినట్టు తహశీల్దార్ జెసికి వివరించారు. మండలంలో పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల అర్జీల పురోగతి పై సిబ్బందితో సమీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విఆరఒలు, సర్వేర్లు, రీ సర్వే సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడవికి నిప్పు మానవాళికి పెనుముప్పు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

అడవికి నిప్పు..మానవాళికి పెను ముప్పు అని అటవీశాఖ ఎఫ్ ఎస్ఒ రెడ్డి వరప్ర సాద్, ఎఫ్‌బిఒ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిపి పాఠశాల విద్యార్థులతో కలసి అడవులకు నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెడితే వాతావరణ కాలుష్యంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు. ఎన్నో వన్యప్రాణులు ఆవాసం కోల్పోతాయని, విలువైన వృక్షసంపద దెబ్బతింటుం దన్నారు. కార్యక్ర మంలో ఇఒఆర్‌డి నరసింహులు, హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి, మెడికల్ షాప్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్లకు ఉత్తమ పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్‌టిసి డిపోకు చెందిన ముగ్గురు ఉద్యోగులు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికై పురస్కారాలను అందుకున్నట్లు డిపో మేనేజర్ పి.నిర్మల తెలిపారు. అన్నమయ్య జిల్లా, రాయచోటిలో 36వ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ఆర్‌టిసి డిపోల్లో ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపికైన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. ప్రజా రవాణా సంస్థలో గత 29 ఏళ్లుగా డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తూ ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు కారణంకాని పీలేరు డిపోకు చెందిన ఇ.గోవిందు, పిసి రెడ్డి, టి.ధనరాజ్ పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు. వీరు కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా డిపిటిఒ గోపాల్ రెడ్డి, రాయచోటి సిఐ విశ్వనాథరెడ్డి ఎంవిఐ సుబ్బరాయుడు చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో పీలేరు ఆర్‌టిసి డిపో సిఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లుగా సత్కారం అందుకున్న వారితో పీలేరు డిపో అధికారులు

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూల స్తంభం

-ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

ప్రజాశక్తి-రాయచోటి

మన దేశ ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూల స్తంభం రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి అన్నారు. రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ జిసి అసిఫా సుల్తానా, లక్కిడపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె. ఫైజునిసా బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో వీడ్కోలు సమావేశాన్ని రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఏర్పాటు చేశారు. సమావేశానికి రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి కృష్ణన్ కుట్టి మాట్లాడుతూ మనదేశంలో న్యాయవ్యవస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉందని దేశంలోని ఎమ్మెల్యేలు కానీ, ఎంపీలు కానీ రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టాలు చేసినచో వాటిని సమీక్షించే అధికారం సుప్రీంకోర్టుకు మన రాజ్యాంగం కట్టబెట్టిందని, ఇది మన రాజ్యాంగ గొప్పతనమని అన్నారు. ప్రపంచంలోని 60 దేశాల రాజ్యాంగాలను సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతనే మన రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాయబడిందని అన్నారు. దేశంలోని అన్ని మతాల, కులాల హక్కులను గౌరవించే గ్రంథం ఉందంటే అది రాజ్యాంగం తప్ప మరొకటి కాదని అన్నారు. అనంతరం న్యాయమూర్తి జిసి అసిఫా సుల్తానా మాట్లాడుతూ తాను రాయచోటి కోర్టులో అతి తక్కువ కాలం పని చేసినప్పటికీ ఎలాంటి సమస్యలు లేకుండా న్యాయవాదులు నాకు బాగా సహకరించారని అన్నారు. ఇక్కడనుండే సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ పై బదిలీపై వెళ్లడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రమోషన్ పై వెళ్లిపోవడానికి సహకరించిన వారందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. లక్కిరెడ్డిపల్లి జూనియర్స్ జడ్జి ఫైజునిసా మాట్లాడుతూ గత తాను పనిచేసేనంత కాలం రాయచోటి లక్కిరెడ్డిపల్లి న్యాయవాదులందరూ కూడా తనకు బాగా సహకరించారని ఎలాంటి సమస్యలు లేకుండా ఇక్కడ నుండి నేను ప్రమోషన్ పై వెళుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు, జిసి అసిఫా సుల్తానా, ఫైజున్నేసా లను ఘనంగా సన్మానించారు.

సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు హేతుబద్దీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అయితే సచివాల యం ఉద్యోగులకు చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రొబేషన్ సమయంలో ఉన్న మూడు సంవ త్సరాలకు మూడు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని కోరుతూ, సచివాలయం ఉద్యోగులందరికీ జాబ్ చార్ట్ ప్రకటించాలని విన్నవించినట్లు తెలిపారు. అందరకి (సచివాలయం ఉద్యోగులలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని, కావున వారి అర్హతను బట్టి మాతృశాఖలలో నియమించాలని విజ్ఞప్తి చేశామన్నారు. డిపార్ట్‌మెంట్ వారీగా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం చేయాలని, కొన్ని జిల్లాలో కొంతమంది అధికారులు సచివాలయం ఉద్యోగులకు జీతాలు పెట్టడంలో, సెలవులు ఇవ్వడంలో ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. స్పందించిన సిఎం న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసం వద్ద శుక్రవారం ఉదయం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ఎమ్మెల్సీకి వినతి పత్రాలు సమర్పించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పిజిటి స్టేట్ కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లాలోని పిజిటి సమస్యలపై ఆయనతో చర్చించారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిజిటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశు, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గుర్నాథ్ రెడ్డి, రామ గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి,



గాలివీడు : యూనిక్ ఐడిని నమోదు చేసుకుంటున్న రైతులు

ప్రతి రైతూ యూనిక్ ఐడి పొందాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 16 రైతు సేవా కేంద్రాలలో భూమి ఉన్న ప్రతి రైతూ యూనిక్ ఐడి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గౌతమి పేర్కొన్నారు. 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదుకు అవసరమై ఉంటుందని రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయినా సెల్ ఫోన్ తీసుకొని రైతు సేవ కేంద్రానికి వెళ్తే అక్కడ నమోదు చేస్తారని చెప్పారు. పేర్కొన్నారు. శుక్రవారం కొన్ని రైతు సేవ కేంద్రాలను తనిఖీ జేశామని, అన్ని రైతు సేవ కేంద్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. **నందలూరు :** మండలంలో భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా యూనిక్ ఐడిని పొందాలని మండల వ్యవసాయ అధికారి జి. మల్లికార్జున తెలిపారు. ఈ పథకం క్రింద రైతుకు గుర్తింపు కార్డు ను ఇస్తారని తెలిపారు. ఈ పథకం వ్యవసాయ ,రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమమని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందే అన్నీ పథకాలకు ఈ కార్డు తప్పనిసరి అని తెలిపారు. రైతులు తమ పేరు నమోదు చేసుకోవడానికి సమీపం లోని రైతు సేవ కేంద్రాలకు ఆధార్ ,పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ అనుసంధానిత ఫోన్ నెంబర్ తో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ను కలవాలని తెలిపారు.

నేటి నుంచి ఎస్‌బిఐ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండల కేంద్రంలోని ఎదురుమిట్టపై స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా నూతన శాఖను శనివారం ప్రారభించబోతున్నట్లు మేనేజర్ ఆంజనేయులు, ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మలిశెట్టి శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. బ్యాంకు సేవలను మండల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని వారు కోరారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

విఆర్‌డిఎస్ సంస్థ 19వ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు విఆర్‌డిఎస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు తమ సంస్థ 2006లో అప్పటి ఎంపిపి గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారని అప్పటినుంచి గత 19ఏళ్లుగా మహిళా సాధికారత, యువత నైపుణ్యాభివృద్ధి, రైతంగానికి, సీనియర్ సిటిజన్ల మద్దతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి జిల్లాలోనే ప్రముఖ సామాజిక సేవా సంస్థగా పేరు పొందిందని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఎటువంటి లాభాపేక్షా లేకుండా మారు మూల ప్రాంతంలో ఎస్‌డికెఆర్ డిగ్రీ, పీజీ కళాశాల స్థాపించి ఎంతో మంది నిరుపేద విద్యార్థులు పట్టాలు పొంది ఉన్నత కొలువులు సాధించారన్నారు. గత 19ఏళ్లుగా సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులు, అధికారులకు దన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. భాస్కర్ రెడ్డి ని ట్రెజరర్ బాబు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి,ప్రభుత్వ డాక్టర్ మనీషా, సభ్యులతో కలసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది విఆర్డియెస్ సభ్యులు అలికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ చైర్మన్, అఖిల భారత రెడ్ల సంఘం మాజీ ఉపాధ్యక్షులు కనుగొండ మద్దిరెడ్డి సొంతనిధులు రూ.1.20 లక్షలతో తంబళ్లపల్లెలో పలుచోట్ల సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, రోగులు, ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల,హైస్కూల్,పాత కళాశాల మైదానంలో 35 సిమెంటు బల్లలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలో వైద్యులు, ప్రజలతో కలసి బల్లలను ప్రారభించారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రాంత్ రెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్ వెంకటరాముడు, శేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో కలిసి సిమెంటు బల్లలను ప్రారంభిస్తున్న మద్దిరెడ్డి

క్రైం కార్నర్

ఘోర రోడ్డు ప్రమాదం

-భర్త మృతి : భార్యకు గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లి క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్యకు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్ఐ వెంకట్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుమ్మరపల్లెకు చెందిన దగ్గుపాటి పెద్దరెడ్డయ్య(67) తన భార్య లక్ష్మీ నరసమ్మతో కలిసి స్కూటీలో బండపల్లి నుంచి నడిగడ్డ పల్లికు వెళుతూ బండపల్లి వద్ద క్రాస్ అవుతుండగా రాయచోటి నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొట్టిందని అన్నారు. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన భార్య భర్తలను రాయచోటి ఆసుపత్రికి తరలించారని అన్నారు. చికిత్స పొందుతూ భర్త పెద్ద రెడ్డయ్య మృతి చెందాడని, భార్య లక్ష్మీనరసమ్మకు రెండు చేతులు విరిగి కుడికాలు విరిగి తీవ్ర గాయాల పాలయిందని అన్నారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం బోల్తా : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ద్విచక్రవాహనం బోల్తాపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో జరిగింది. మండలానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తి గుమ్మసముద్రం సమీపంలో కొత్తపల్లి వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు గమనించి హుటాహుటిన అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనలు మేరకు బాధితుడిని 108 ఇఎంటి ఉమాపతి, పైలట్ రాజులు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.